పెద కథ

# జాతకఫలం

పి. వి. పల్లి

(గతసంచిక తరువాయి)

నిజానికి, సుబ్బారావుకీ క్రొత్తసంబంధం అంటే యిష్టంలేదు. నిక్షేపంలాంటి దా సంబంధం. నారాయణరావు "కవి"కూడా నని తెల్సుకున్న తరవాత, తనుకూడా కవిత్వంలో వేలుపెట్టినవా డవడంవల్ల అతనిగూర్చి మరీ బాధ పడేవాడు. కాని యేది యెల్లావున్నా ధైర్యంచేసి ముందుకు అడుగుపెట్ట లేకపోయాడు. కోటీశ్వర్రావుని పదే పదే వేధించుకుతిన్నాడు, కాని అతనుమాత్రం యేం చెయ్యగలడు? "అక్కడ పులి వున్నది" అంటే, నిజంగావున్నా లేకపోయినా-అదో అను మానంగా పీడిస్తుంది. ఆ అనుమానానికి దోహద మిచ్చింది కామేశ్వరమ్మా, తన భార్యా చెప్పిన మాటలు. తన భార్యకూడా బాధ్యతగలదే యీ విషయంలో. తన చెల్లెలిని "అలాంటి"వాడి కివ్వ డానికి తనకీ యిష్టంలేదు.

అయితే వీరభద్రరావు రావడంతో వాళ్ళలో మరో క్రొత్తవిషయం బయలుదేరింది. కామేశ్వ రమ్మకి అనుమానం కలిగింది, పాత పెళ్ళివారే ఇతన్ని పంపించారేమోనని.

"కామేశ్వరత్తయ్యా-నువ్వు వెయ్యేళ్ళ తపస్సు చేసినా యిలాంటి సంబంధం తేగలవ్వా? డబ్బుకి డబ్బావుంది, విద్యావంతుడు. మంచి గుణశాలి." చెప్పుకుపోతున్నాడు వీరభద్రం.

"నువ్వు యెన్నిచెప్పినా ఆ సంబంధంగూర్చి యేం తాపత్రయపడ దలచుకోలేదు."

"అలా అనడం న్యాయం కాదు. ఎవరో చెప్పినదాన్ని పుచ్చుకుని నిక్షేపంలాంటి సంబం ధాన్ని వొదులుకోవడం ఏం బాగులేదు."

కామేశ్వరమ్మ కొంతసేపు మౌనం దాల్చింది.

విజయలక్ష్మి గ్లాసుతో కాఫీ తెచ్చి వీరభద్రం ముందు పెట్టింది. పినతల్లివేపు కోపంగాచూస్తూ ముఖం చిట్లించుకుని గదిలోకి వెళ్ళిపోయింది. మేనమామ మంచంమీద పడుకుని విచారంలో మునిగిపోయింది. ఈవిధంగా నారాయణరావు తనకోసం యింకా ప్రయత్నం చేస్తున్నందుకు మనస్సుకి ఆనందంకలిగినా పినతల్లి, ఆ ప్రయ త్నాల్ని విఫలంచేసి తనని మరొక డెవడికో కట్టి చూస్తున్నందుకు దుఃఖం పొర్లుకొచ్చింది.

మళ్ళీ వినపడ్డాయ్ మాటలు.

"మీరు మీ పిల్లకి పెళ్ళి చేసిందాకా తను పెళ్ళి చేసుకోనంటున్నాడు ఆ కుర్రాడు" కాఫీ గ్లాసు క్రిందపెడుతూ అన్నాడు.

"అదికూడానా భద్రం నన్ను మన్నించు, మరి ఆ విషయంగూర్చి మాట్లాడకు—"

"మీకర్మం. యింతకీ మీ పిల్లకూడా వాడి కోసమే నిరీక్షిస్తూందిట కదూ."

"దానికేం తెల్సు? పసికూన. తెల్లనివన్నీ పాలు, నల్లనివన్నీ నీళ్ళు అనుకుంటుంది. దాని బ్రతుకు బాగా చెయ్యవలసినవాళ్ళం మనం."

"అవును...దానికేం తెల్సు నాబాధ!" గొణు క్కుంది విజయలక్ష్మి.

"అదీగాక నాకో అనుమానంవుంది భద్రం. నా పెళ్ళి విషయంలోకూడా యీలాంటి అను మానాలే వచ్చాయి. మానాన్న మొండికెత్తి నా పెళ్ళి జరిపించారు, మా అమ్మ వద్దంటున్నా. ఆయనికి ముప్ఫయ్యోయేట గండంవుందని జ్యోతి ష్కులు చెపితే మా నాన్న నమ్మలేదు. చివరికి అలాగే అయింది. నా నూరేళ్ళబ్రతుకూ గంగలో గలిసింది."

"పోనీ నువ్వన్నట్లు, అతని జాతకంలో తప్పు యేమీలేదే. ఊరికనే కల్పించారుగాని—"

"ప్రకాశం బావయ్య చెప్పారుకదూ. ఆయ నకి బాగా తెల్సునట జాతకాలగూర్చి."

"కోటీశ్వర్రావు నపుంసకుడని వాడి చిన్న తనంలో అనలేదూ. అప్పటికప్పుడే పెళ్ళికూడా జరిగిపోయిందాయెను. సూర్యనారాయణపంతులు యెంతగానో బాధపడ్డాడు. కాని ఆరుగురు పిల్లల తండ్రివాడు. మరి అలాంటి జాతకమేనా ఆ ప్రకాశంగారు నేర్చుకున్నది?"

"పోనీ కట్నమైనా తగ్గిస్తే బాగుండును వాళ్లు" అంది కామేశ్వరమ్మ. ఆశ బయలుదేరింది వీరభద్రంలో.

కళ్ళువిప్పి చూచింది విజయలక్ష్మి యింటి కప్పువేపు. కాని పెంకులే అవుపిస్తున్నాయి.

"అలా అంటే అదొక తరహాగా వుంటుంది. గాని పనేమిరా అని తిరగ్గొట్టడం యేంబావుంది? ఇంతకీ మీవుద్దేశం యేమిటి?"

"అందులో సగం అయితే..."

"పోనీ యీ విషయం వాళ్ళతో చెప్పి దాని గూర్చి ఆలోచిద్దాం."

కామేశ్వరమ్మ అప్పటికా మాటలాడి, వీర భద్రం పీడ వొదిలించుకున్నట్టుగా భావించింది. కాని, క్రొత్త సంబంధంమీదవున్న మోజు యీ సంబంధంమీద లేదు. తన కొడుకు రామచంద్రా నికి రెండువేల కట్నంతో పిల్ల వస్తూంది. తను, విజయలక్ష్మి విషయంలో దమ్మిడీ యివ్వనక్కర లేదు. ఏది యేమైనా తన విజయలక్ష్మిని వాళ్ళ అబ్బాయికీ, వాళ్ళ సరోజినిని తన రామచంద్రా నికీ యిచ్చి పెళ్ళి చెయ్యాలని తీర్మానించుకుంది.

* * *

పూర్ణమ్మా, విజయలక్ష్మి యిద్దరూ స్నేహి తులు. ఒకరియింటికి ఒకరు వెళుతూనే వుంటారు. వయసులో పూర్ణమ్మ పెద్దదే. పాతికకి పై బడ్డాయి. కాని తన యిరవయ్యోయేటనే భర్తృ విహీనురాలైన కారణంగా తండ్రివద్దనే వుండి పోయింది. తన స్వంత ఆస్థి పాతిక వేలరూపా యిలూ రామలింగంగారిద్వారానే వున్నాయి. ఆ డబ్బెట్టి కూతురిపేర ఓమేడ కొన్నాడు. అందు లోనే తనువుంటూ యేటా అయిదువంద రూపా యిలదాకా కూతురిపేర బ్యాంకులోవేస్తున్నాడు.

మూడేండ్లనుండీ విజయలక్ష్మికీ తనకీ స్నేహం కుదిరింది. పదిహేను సంవత్సరాలు నిండి పద హారోయేడు సగందాకా గడిచిపోయింది విజయ లక్ష్మికి. ప్రతిదినం యేదో సమయంలో వీళ్ళ యింట్లోనో, వాళ్ళ యింట్లోనో కలుసుకోకపోతే వుండలేని పరిస్థితి. అయితే విజయలక్ష్మికి యీ సంబంధం రావడం, విఘ్నం కావడం యిత్యాదు లన్నీ జరిగినప్పుడు పూర్ణమ్మ అత్తవారింటికి వెళ్ళింది. మామగారూ, అత్తగారూ పట్టుదలగా వుత్తరాలు రాస్తూంటే, బాగుండదని ప్రయాణ మయింది. రెండునెల్లు గడిచాయి. మళ్లీ యివాళ కల్సుకున్నా రిద్దరూ.

"పూర్ణమ్మా—నా జీవితం ఎలావుంటుందో తెలీదు."

"ఏం ఫర్వాలేదు. నేనున్నానుగా. నిన్న రాగానే నాన్న అన్ని విషయాలూ చెప్పారు. విచారించాను—"

"అంతా మా పిన్నిలోనే వుంది."

"అవును. మీ పిన్నిది మొండిపట్టు—మంచీ చెడ్డా తెలీదు. ఎవరు చెప్పిందైనా వినడంతప్పితే యుక్తాయుక్త విచక్షణ యుండదు."

"అందుకే సుబ్బారావు మామయ్యా, కోటీశ్వ ర్రావూ, మీ నాన్నా—అంతా నోరుమూసుకు న్నారు"

"నయ్యాళిగంప ముందు, వీళ్ళందరూ చేత గానివాళ్ళయిపోయారు."

"బాగాచెప్పావ్. అసలు వారందినాలనుండి నాకు అదోలావుంది పూర్ణా. అన్నం సాయించ డంలేదు. ఏ పని చేద్దామన్నా బుద్ధపుట్టడంలేదు. రాత్రిళ్లు అసలు నిద్రే వుండదనుకో."

"అవునుమరి..." పెదవి విరిచింది పూర్ణమ్మ. నిట్టూర్చింది.

"అయితే-యీ క్రొత్త సంబంధం,జరిగి తీరు తుందంటావా?"

"కాకుండా చెయ్యడానికే ప్రయత్నిద్దాం."

"ఎలాగైనాఅతన్ని ఓసారి చూడాలనిపిస్తుంది పూర్ణమ్మా. నీతోగనక యీ రహస్యం చెపుతున్నా నీకంటే, యీ సమయంలో, నాకు మారొకరె వరూ సహాయం చెయ్యలేదు."

"నారాయణరావు యీసారి యిక్కడికొచ్చి నపుడు నీకు కబురంపిస్తా, నువ్వు వద్దువుగాని."

"అలాకాదు, త్వరగానే జరగాలి."

"ఏం...?"

"రేపు సాయంత్రం యీ క్రొత్త సంబంధం వాళ్ళు వస్తారట. ముందు ఆ కుర్రాడి ఫోటో పంపించారు. నా ఫోటో మావాళ్ళు పంపేరు: యెప్పుడో యేడాదిక్రిందట మా రామచంద్రం అన్నయ్య తీసింది."

"సరే ఆలోచిద్దాం. యిప్పుడు పదిగంటలే అయిందికదా—ఈ సాయంత్రందాకా టైంవుంది.

ఎందుకేనా మంచిది, మధ్యాహ్నం రెండుగంట లకి ఓమారు రా."

"వస్తా పూర్ణక్కా. అంతా నీచేతుల్లోనే వుంది."

గుమ్మం దిగిపోయింది విజయలక్ష్మి.

రామలింగంగారు కోర్టుకు వెళ్ళిపోయారు భోంచేసి. ప్లీడరు గుమస్తా.

* * *

ఆ వూరు వచ్చినప్పుడల్లా రామప్పంతులుగారు గాని, నారాయణరావుగాని రామలింగంగారింటికి రాకండా వెళ్ళరు. అది అలవాటుగా పెట్టుకు న్నారు. తిష్ట వీళ్ళింట్లోనే. పూర్ణమ్మ యెంత గానో ఆదరిస్తుంది వాళ్ళని. తమ్ముడికి పెళ్ళయిం తర్వాత, వాడూ, వాడిపెళ్ళామూ ఉద్యోగం మీద మరో వూరెళ్ళిపోయారు. ఉన్న మరో తమ్ముడు యింకా చిన్నవాడు. రామలింగంగారి భార్య మరణాంతరం, కూతురే ఆ రెండోవాణ్ణి చూస్తూంది. పెద్దవాడు పుట్టిన పదేళ్ళకి పుట్టాడు వాడు. ఆ పురిట్లోనే ఆతనిభార్యా కాలంచేసింది.

సరిగ్గా ఒంటిగంట అయింది. నారాయణరావు గుమ్మంలో అడుగుపెట్టాడు. పూర్ణమ్మ ఉప్పొంగి పోయింది; తన ఆశయం, సంకల్పం నెరవేరబోతు న్నందుకు. పట్టరానిసంతోషాన్ని అనుభవించింది. తన స్నేహితురాలి కోర్కె తీరుతున్నందుకు ఎంత గానో సంబరపడిపోయింది. రెండుగంటలకి తను రమన్నది విజయని.

"ఎప్పుడొచ్చావ్ పూర్ణమ్మా? ప్రశ్నించాడు. గుమ్మంయెక్కుతూనే, నారాయణరావు.

"నిన్న సాయంత్రం వచ్చాను."

"మీఅత్తగారూ, మామగారూ అంతా కులా సాయేనా?"

"ఆс-కులాసాగానే వున్నారు."

"మీ మామగారు పూర్తిగా లొంగి పోయారు."

"వృద్ధాప్యం. ఎనభయ్యో పడి దాటింది కూడాను."

"పూర్వకాలపువాళ్ళుగనక ఇంకా దార్ఢ్యంగా వున్నారు. యీ కాలపువాళ్లు నలభయి దాట గానే నడుం వంచేస్తారు."

"మీ అమ్మా, నాన్నా తమ్ముడూ--కులాసా యేనా?"

"ఆс...కులాసా."

"ఎక్కడన్నా పెళ్ళి మాటలు జరుగుతు న్నాయా నీకు?"

"అయ్యో! మీ నాన్నగారు యేమీ చెప్పనే లేదా?"

"అది యెలాగూ తప్పిపోయిందికదూ. మరో కటేదైనా..."

"అలాటిదేమీ యింకా జరగలేదు. అసలు నాకు పెళ్ళి చేసుకునే తలంపేలేదు."

"ఏమోయ్! వైరాగ్యంలోపడ్డావు?"

"అదికాదు పూర్ణమ్మా, మనసారా యిష్ట పడ్డాను. మావాళ్లుగూడా యిష్టపడ్డారు. అదీ గాక, లేనిపోని నిందలు మోపేడు ప్రకాశం. నాకు యింకా మరోపెళ్లి జరుగుతుందని-ఎవరూ చెప్పలేదు, వాడుతప్ప. ఎనమండుగురు పేరుబడ్డ సిద్ధాంతులకి చూపించాం."

"మీ వీరభద్రంగార్ని పంపించారటగా?"

"మా నాన్నకీ, అమ్మకీ యిష్టం లేనేలేదు. నేనే వుండలేక పంపించాను. ముఖం తేలేచు కొచ్చాడు."

సిగరెట్టు ముట్టించి, మళ్ళీ మొదలుపెట్టాడు.

"కట్నం తగ్గించాలని మహాప్రీతికోసం అన్న దట ఆవిడ. అలాగే తగ్గిస్తామని భద్రం చెపు తూంటే, పెదవి విరిచిందట."

"పోనిద్దూ. మరోసంబంధం రాదుగనుకనా?"

"వస్తాయి. రాకపోవు. కాని ఆ అమ్మాయి పెళ్ళి జరిగితేనేగాని..."

మెట్లు యెక్కుతూంటే చెవినిబడ్డాయా మాటలు, విజయలక్ష్మికి. తాను యింతకుముందు భద్రం చెప్పినప్పుడు కూడా, యీ మాటలే విన్నది. సిగ్గుతో, అవతలనే నిలుచున్నది. లోప లికి రాలేకపోయింది.

"నీలాగే, ఆ అమ్మాయికూడా అనుకుంటుంది. యిందాకనే వచ్చి వెళ్లింది" అన్నది పూర్ణమ్మ.

అరె. తాను యింతకుముందే వచ్చినట్లయితే యెంత బాగుండును! కళ్ళారా మరోసారి చూచి వుండేవాడు. కాని యెలాగయినా చూదామనే అనుకుంటున్నాడు. అది పూర్ణమ్మవల్ల సాధ్యమ వుతుందన్న నమ్మకంమీదనే అక్కడకొచ్చాడ సలు.

"మళ్ళీ యెప్పుడొస్తుందా అమ్మాయి?" అడగ్గోయి వూరుకున్నాడు. వీధిలోని వెళ్లిపోయింది పూర్ణమ్మ. అలా కుర్చీలోనే వుండిపోయి, సిగరెట్టు పొగ మెలికలు తిరుగుతూ పైకిపోతూంటే చూస్తూన్నాడు. మెదడు పనిచేస్తునేవున్నది తను వచ్చినపనిగూర్చి.

*　　*　　*

"జోస్యం వచ్చునా అక్కా" అన్నది విజయలక్ష్మి సంతోషాన్ని పట్టలేక.

"ఆ జోస్యమే కదూ యింతవరకూ 'లాక్కొచ్చింది!" లక్ష్మిభుజంమీద చెయ్యివేసి.

"రా లోపలికిరా-అతనొక్కడే వున్నాడు".

సంశయించింది లక్ష్మి.

"మానాన్న లేరులే" అంటూ లోపలికి నడిచింది లక్ష్మితో.

నాలుగడుగులు లోపలికివేసి ఎదురుగా నారాయణరావు కనబడగానే ఆగిపోయిందిలక్ష్మి.

తనకళ్ళని తానే నమ్మలేకపోయాడు. ఇప్పటివరకూ ఆమెగురించే పూర్ణమ్మతో చెబుతున్నాడాయెను. యింతలోనే తనుచూడగలిగినందుకు పరమానందభరితుడయి పోయాడు. సిగరెట్టుని కిటికీలోనుంచి బయటకు విసిరి "పూర్ణమ్మా నువ్వు ఘటికురాలివి, యింతలోనే యెలా తీసుకురాగలిగావ్?" నవ్వుతూ ప్రశించాడు.

"నన్నెందుకడుగుతావ్ నీ లక్ష్మినే అడుగు" వంటిట్లోకి వెళ్ళిపోయిందామె. వీధితలుపులు అంతకుముందే బంధించబడివుండడం నారాయణరావు గమనించలేదు.

ఎవరు ముందుమాట్లాడాలో ఎవరికీ అర్థంకాలేదు. తెగించి నారాయణరావే అన్నాడు.

"యిలారా అమ్మాయ్" కుర్చీచూపించాడు.

కుర్చీకి చేరువగావచ్చి నుంచుందివిజయలక్ష్మి.

"కూర్చోడానికి సిగ్గెందుకూ? కూర్చో" సాభిప్రాయంగా అన్నాడు.

"అయితే క్రొత్తసంబంధం గురించి యేమైంది?" మళ్ళీ ప్రశ్నించాడు.

"రేపుసాయంత్రం వస్తారుట వాళ్ళు"

"యింకా మీపెన్ని ఆ మొండిపట్టుమీదనే వున్నదన్నమాట"

"తనకొడుక్కి రెండువేలు రూపాయల కట్నంతో పిల్లవస్తూంటే ఎందుకు మారుతుంది?"

"బాగాచెప్పావు. అయితే మీ సుబ్బారావు మామయ్యకి కూడా యిష్టమేనన్నమాట యీ క్రొత్తసంబంధం?"

"మాపిన్నికి తప్ప యెవరికీ యిష్టంలేదు"

"యెవరికీ యిష్టంలేదు" అన్నమాట చెవిని బడగానే నారాయణరావు గుండెలు కుదుటబడ్డాయి.

ఎందుకేనా మంచిదని—

"అయితే నువ్వేమిటి ఆలోచించావ్!"

జవాబులేదు—

"చెప్పు నేనేమైనా అనుకుంటానని సంశయిస్తున్నావా?"

"నాకూ యిష్టంలేదు"

"అయితే విషయం చెప్పెయ్యలేకపోయావ్?"

"ఎన్నిసార్లో చెప్పాను. ఎంతగానో ఏడ్చాను కాని నామాట యెవరు వింటారు?"

"అయితే యేంచెయ్య దలచుకున్నావ్?"

వెక్కి వెక్కి యేడవడం మొదలు పెట్టింది.

"ఊరుకో అమ్మాయ్. యేడిచి యేం ప్రయోజనం"

దగ్గరగావెళ్ళి రుమాలుతో కళ్లుతుడిచాడు.

లేచినుంచుంది లక్ష్మి.

"యెందుకూ యేడుపు? నువ్వు యేం నిర్ణయించుకున్నావ్?"

"మిమ్మల్ని తప్ప యింకొకర్ని పెళ్ళిచేసుకోవడం నాకిష్టంలేదు"

అతని హృదయంమీద వ్రాలిపోయింది.

"అందుకు మీవాళ్లు యెవరూ యిష్టపడడంలేదటగా"

"అవును"

"మరి యేంచెయ్యాలనుకుంటున్నావ్?"

"మావాళ్లుకూడా యిష్టపడడంలేదని యిప్పుడే యెవరో సుబ్బారావు మామయ్యతో చెప్పారట"

"మావాళ్ళకి నేను లొంగను"

తన బాహుబంధంలో యిరికిపోయింది లక్ష్మి. నారాయణరావు మైకంలో పడిపోయాడు.

పూర్ణమ్మ తలుపులు తెరచుకుని లోనికి ప్రవేశించింది. నవ్వుకుంటూ అన్నది "యింకా పెళ్ళికాకుండానే..."

*　　*　　*

ఇంకా స్త్రీ స్వాతంత్ర్యం సంపాదించుకో

లేక పోయినందుకు నారాయణరావు విచారించాడు. మిగతా వాటిల్లో యెల్లావున్నా తను యిష్టపడ్డవాణ్ణి పెళ్ళిచేసుకునేందుకైనా స్వతంత్రం లేకపోతున్నందుకు తనకి సంఘంమీద కోపం వచ్చింది. లక్ష్మికి పెళ్ళిస్థిరపడి పోయిందని తెల్సినాక రెండుదినాలదాకా అన్నం, నీరు ముట్టలేదు. తండ్రీ, తల్లీ యెంతగానో బాధ పడ్డారు జరిగినవాటిగుర్చి.

"పోనీ యేం చేస్తాం-మరోటవుతుంది" రామప్పంతులు.

"ఆసంబంధం తప్పిపోవడమే మెరుగు. ఆపిల్ల జాతకం మంచిది కాదటగా" అన్నది మీనాక్షమ్మ.

"యెవరికెవరికి ఘటనవుందో యెవరికితెల్సు?" వాళ్ళు వీరభద్రంతో చెప్పినట్లు కట్నంకూడా తగ్గిస్తామన్నాం. అయినా వాళ్ళు విననిదే"

"మరి ఆ వూసెత్తకండి" తేల్చేసింది మీనాక్షమ్మ.

"మరోసంబంధంవూసు యెత్తకండి" తన నిశ్చయాన్ని వెల్లడించాడు నారాయణరావు.

"నేయిష్టం" అనేసి పొలం వెళ్ళిపోయారు రామప్పంతులుగారు.

తీరని మనోవ్యధ పట్టుకుంది నారాయణరావుకి. యేమయినా సరే తను మరోకన్యని ప్రేమించలేడు,కామించలేడుకూడా. బ్రహ్మచారిగానే వుండిపోవడానికి నిర్నయించుకున్నాడు. కామేశ్వర్రావూ, రమణమూర్తి, నరసింహం, యిత్యాదిస్నేహితులు రోజుకోసారివచ్చి చెప్పి వెళుతున్నా తనమనసు కుదుటబడలేదు. తననిర్నయాన్ని మార్చుకోదలచలేదు—మార్చుకోలేడు కూడా.

లేనిపోని అనుమానాలతో తమబ్రతుకు యిలా మంటగలవ వలసిందేనా? యీ జ్యోతిషాన్ని ఎవరు నమ్మమన్నారా? జరిగేది యెలాగూ జరుగుతుంది. యింతకీ ఆ ప్రకాశంగాడి ననాలి—ముసలివాడయినా వాడి పాడుబుద్ధి పోనిచ్చుకోలేదు. పోనీ జాతకాలు బాగులేవని చెప్పి వూరుకోరాదూ. మరో సంబంధాన్ని ముందు పెట్టాడు తీసుకొచ్చి. అందుకే కాబోలు అలా తప్పుడు గా చెప్పాడు. యిలాంటివాళ్ళే బ్రతికేవాళ్ళ బ్రతుకులు పాడుచేస్తారు. యెంత ఘాతకకృత్యానికైనా వెనుదీయరు. యిలా ం వాళ్ళని నిలువునా చీరెయ్యాలి. లేకపోతే సంఘంలో యిలాంటివాళ్ళుండి ఎన్నికొంపలు కూలుస్తున్నారోయింకా.

పాపం! యింకా ఆ అమ్మాయి అలా యేడుస్తూనే వున్నది కాబోలు! యెవరుమాత్రం యేం చేస్తారు. తనుకూడా యేమీ చెయ్యలేడు. పోనీ రహస్యంగా తీసుకు లేచిపోదామా అంటే అంత పాటి ధైర్యవంతురాలుగా తనకి కనుపించలేదు. అసలు ఆ విషయం అప్పుడు తనకి తట్టలేదు. యెలాగైనా ప్రకాశంగాడి అంతం కనుక్కోవాలి. యింకా యెంతమందినైనా నాశనం చేస్తాడు.

* * *

ఈజీఛైర్‌లో నడుంవాల్చి కాలుమీద కాలు వేసుకుని పాదం ఆడిస్తూ, చుట్టపొగని వొదుల్తూ దీర్ఘంగా ఆలోచిస్తున్నాడు ప్రకాశంగారు. తను కృతకృత్యుడైనట్టే నిజంగా ఆ జాతకం నారాయణరావుది తప్పుగాలేదు. అయితే తన స్నేహితుడికి మేలుచేసినట్లవుతుందని తను యీవిధంగా ప్లేటు మార్చాడు. అయినా కొద్దిపాటి దోషాలు లేకపోలేదు ఆ కుర్రాడి జాతకంలో. పోనీ వచ్చి "యెలాగన్నా రైటు చెయ్యండి" అంటే యేదోవిధంగా రైటు చేసివుందును. ఇప్పుడు యేం మించిపోయింది. పసందైన సంబంధం తెచ్చాను. అయినా కామేశ్వరమ్మకి నా మాట మీద గురి. అందుకే నేను చెప్పేసరికి అందుకుంది. సుబ్బారావుగాడు ఒఠ్ఠి దద్దమ్మ. కోటీశ్వర్రావుకి వున్న బుర్ర తిరుగుడు దీంతో కట్టిపోయింది. రామలింగం నిజంగా జాతకాల్లో మంచి అనుభవం వున్నవారే. ఇంతకీ నాముందా వాడి ప్రభావం?" ఆలోచనల్లో మునిగిపోతున్నాడు.

"ప్రకాశం యేం చేస్తున్నావోయ్?" ప్రశ్నించాడు స్నేహితుడు మేడమీదకొచ్చి.

"ఆఁ...ఏంలేదు. జరిగిన దానిగుర్చి ఆలోచిస్తున్నా—"

"పిల్ల దానిజాతకం బాగులేదని వాళ్లు పుట్టించారోయ్—"

"వాళ్ళమాటలు నమ్మకు ఫస్టుక్లాసయిన జాతకం దానిని వాళ్ళకికాకుండా మీకు రైటు చేశామని వాళ్లు అలా దుష్ప్రచారం లేవదీస్తున్నారు."

"అంతే నంటావా?"

"మరి?"

"సరే. నీమాట నమ్మేం."

"ఓయి వెర్రి సుబ్రహ్మణ్యం ప్రకాశంమాట రతనాలమూట అంటే నమ్ము..."

"ఇంతకీ మావాడి అదృష్టం ఎలావుందో?"

"దీనిజాతకం మంచిది కనుకనే ఆ రామప్పంతులూ, ఆ కుట్రకుంకా యింకా యెగబడుతున్నారు. ఆమాత్రం తెల్సుకోలేవటయ్యా—"

"మీమేలు జన్మజన్మాలకీ మరువలేం..."

"ఎంతమాటన్నారు—"

"వస్తా...లగ్నం యీ రాత్రే గనుక ఇంకా కొన్ని కొనవలసిన సామానులున్నాయ్. అప్పుడే పదోగంట దాటిపోతూంది" వెళ్ళి పోయాడు సుబ్రహ్మణ్యం.

"నేనూ వస్తా నుండవయ్యా" అంటూ తను కూడా అతన్ని అనుసరించాడు.

*　　*　　*

ఉదయం స్నాతకం జరిగిపోయింది. విజయలక్ష్మి అలా యేడుస్తూనేవుంది. అయినా గ్రహించలే దెవరూ. పూర్ణమ్మ తనకి యేమీ సహాయం చెయ్యకలేకపోయింది. ఏం చేస్తుంది పాపం! తన కర్మ యిలా కాలుతూంటే! ఆనాడు, అంతరాత్మ ఉద్బోధించిన ప్రతి విషయం, తనని బాధిస్తూంది. "పిచ్చిదానా నువ్వు పిరికిపందవు" గద్దించింది మళ్లీ అంతరాత్మ అంతే. మరి మాటాడలేదు తనకి ఎటువంటి కర్తవ్యమూ గోచరించలేదు. ఈరాత్రి తను రామారావుకి "భార్య" అయిపోతున్నది. ఈ విషయం తలుచుకునేసరికి గుండెల్లో బాధ బయలుదేరింది. బాకుతో పొడిచినట్లయింది. తను తప్ప ఆ కొంపలో యెవరూలేరు. పసుపుబట్టలు కావాలి. తన దృష్టిలో అవి రక్తవస్త్రాలు. తనకి కాబోతున్నది పెళ్ళికాదు. తన మెడలో ఉచ్చు బిగింపబడుతూంది.

తన నారాయణరావే తన కళ్లముందు ప్రత్యక్షమవుతున్నాడు. తనతల్లే వుంటే తనని యిలా బలవంతంగా యింకొకరికి యిచ్చివుండదు. కాని ఏం చెయ్యగలదు తను? కుమిలిపోతున్నది

*　　*　　*

మంగళవాయిద్యాలు వాయింపబడుతూంటే, మంత్రవాక్యాలు వల్లిస్తున్నారు పురోహితులు. ఎదురుగా ఆసీనులైన అమ్మలక్కలూ, అయ్యలూ "యీడుజోడు బాగుందం"టూవుంటే ఉప్పొంగి పోతున్నారు కామేశ్వరమ్మ ప్రకాశం ప్రభృతులు.

సుబ్బారావు, కామేశ్వరమ్మ చెప్పిన పనులన్నీ చేస్తూ, పెళ్లిపీటలమీదవున్న వధూవరుల్ని చూచి "పోనీ యీసంబంధమన్నా మంచిదయినందుకు సంతోషం" అనుకుంటున్నాడు. కోటీశ్వర్రావూ రామలింగంగారూ సుబ్బారావుకోసం వచ్చారే గాని వీధి అరుగుమీద కూచుని తమ పంతం నెగ్గలేకపోయినందుకు విచారిస్తున్నారు. స్నేహితురాలికి పెళ్ళి కాబోతున్నదని వచ్చింది కాని, తను ఆమెకి మాట యిచ్చినప్రకారం చెయ్యలేక పోయినందుకు ఎంతగానో చింతించుతూంది పూర్ణమ్మ.

మంగళసూత్రధారణం అయ్యేసరికి విజయలక్ష్మి బావురుమంది. వెంటనే ప్రక్కకి ఒరిగి పోయింది.

అంతా మూగారు. యేదో అఘాయిత్యం జరిగిందని పెళ్లికొడుకు పక్షంవారు ఆందోళన పడుతూంటే, ప్రకాశంగారు చూస్తూ మిన్నకున్నారు.

"యీ మధ్య కొంచెం జ్వరంపడింది. ఇంకా నీరసం వదల్లేదు"అన్నది కామేశ్వరమ్మ.

కాని వియ్యపురాలి గుండెల్లో రాయిపడింది. ఒట్టి రోగిష్టి కాబోలు తన కోడలని ఊహించింది.

అటువంటిదాన్ని కట్టుకుంటున్న తన బ్రతుకు యేమవుతుందోనని రామారావు దిగులుపడుతున్నాడు. తనకి, అసలు విషయం—అంటే నారాయణరావుని పూర్తిగా ప్రేమించిందని, తెలీదు. తెలిస్తే యేంచేసేవాడో మరి?

*　　*　　*

గర్భాదానంకూడా వెంటనేచేసేస్తే ఖర్చులో ఖర్చు కలుస్తుందని కామేశ్వరమ్మగారూ, వియ్యపురాలు మొదలుగాగల వారందరూ నిర్ణయించినదానికి, ప్రకాశంగారు "బాగుంద"న్నారు. అంచేత యివాళే దాన్నికూడా జరిపింతామని నిశ్చయించారు. నిన్నటి పెళ్లి బడలికలు ఇంకా వొదల్లేదు మొగపెళ్లివారికి.

విజయలక్ష్మి మధ్యాహ్నం భోజనం మానేసింది. యెంతమంది చెప్పినా తను వినలేదు. కంటికీ, మంటికీ ఒకటే ధారగా యేడుస్తూంది.

పూర్ణమ్మ తప్పితే, ఆమెవద్ద మరెవరూలేరు. సాయంత్ర నాలుగ్గంటలయేసరికి బంతులాడిస్తామని అత్తగారు వరహాలమ్మవస్తే, పూర్ణమ్మ మధ్యలో కలిగించుకుని "యిప్పుడెందుకులెద్దురూ. రాత్రి వాళ్ళే ఆడుకుంటూరు" అనేసింది. వరహాలమ్మగారు ముఖం చిన్నబుచ్చుకుని వెళ్లిపోయారు. కాని గుండెలు శరవేగంతో కొట్టుకుంటున్నాయి.

"పూర్ణక్కా..." వెక్కి వెక్కి యేడవడం మొదలు పెట్టింది.

"వూరుకో లక్ష్మీ. యెన్ని అనుకుంటే యేం లాభం? యెంత యేడిస్తే యేం ప్రయోజనం? మనం యేమీ చెయ్యలేం. చేసుకుంటే నీ జీవితాన్ని నువ్వే నాశనం చేసుకుంటున్నావన్న మాట. అందనిదానికోసం ప్రయత్నించడంవల్ల యేమీ కలిగేదిలేదు. నామాట విను లక్ష్మీ."

చీరచెంగుతో కళ్ళు తుడిసింది.

"యింకా యేంమనసు. నాకు మనస్సులేదు. నేను మనిషినీకాను. నేనొక జీవచ్ఛవాన్ని."

"అబ్బే. అలా నిరుత్సాహపడితే యెలా? రాత్రిపడుతున్నా యింకా నువ్వు విచారిస్తుంటే, ఆనక ఆయన యేమన్నా అనుకోగలడు."

"ఏమనుకున్నా అనుకోనీ, నాకు సంతోషం లేదు. నా జీవితం యెప్పుడో ఒకప్పుడు హఠాత్తుగా అంతరించిపోతుంది."

"పిచ్చిదానా. యిటుచూడు. యేడిస్తే నా మీద వొట్టు."

* * *

చిరంజీవి! విజయలక్ష్మికి-

మనం యిరువురం కలుసుకొనే భాగ్యం మనకి లేదిక. మనల్ని మన పెద్దలే వేరుచేశారు. "జ్యోతిషం" పేరుచెప్పి తమ పని ముగించారు. నువ్వులేనిదే నేను ఒక్క క్షణంకూడా జీవించలేనని నాకు తెల్సు. అందుకే నా ప్రాణం వుండగానే, నీకు యీ వుత్తరం వ్రాశాను. యీ వుత్తరం నా మనస్సుకి కొంత శాంతిని చేకూరుస్తుందనే నమ్మకం కలిగింది.

రామలింగంగారింట్లో మనం కల్సుకున్నాం. గాఢాలింగనం చేసుకున్నాం. అదిచాలు, మన జన్మలు తరించాయి. యీలోకంలో, యీ పెద్దలనిపించుకున్న కిరాతకులు, యింతకన్న మనల్ని యేమీ చెయ్యలేరు. శరీరాల్ని వేరుచేశారు, కాని హృదయాల్ని వేరుచెయ్యలేరు.

నీకుకాబోయే భర్త రామారావుని జాగ్రత్తగా చూసుకో సెలవ్—

ఇట్లు
నారాయణరావు.

ఉత్తరం ముగించాడు. దీపంతగ్గించేసేడు నారాయణరావు. మడిచి టేబులుమీద వుంచాడు వుత్తరాన్ని.

* * *

తలుపు గొళ్ళెంపెట్టి యివతలకొచ్చేరు అమ్మలక్కలందరూ.

సుబ్రహ్మణ్యంగారితోచెప్పి ప్రకాశంగారు మేడమీది గదిలోకిపోయి ఫేన్‌వేసుకుని, పడుకున్నారు హాయిగా. గుండెమీద చేతులు వేసుకుని కళ్ళుమూశారు. చెయ్యవలసిన పని పూర్తయింది...ఆ రాత్రి తను రామారావుకి పూర్తిగా వశమయిపోతుంది. మరి నారాయణరావు తనకి కనుపించడు. ఎంతో దూరంలో వుంటాడు. ముచ్చటగా చూదామన్నా వీలుండదు. యింతకుముందు కలుసుకున్నట్లు రామలింగంగారిట్లో అతన్ని కల్సుకోలేదు. పూర్ణమ్మనికూడా మరచిపోవాలి. తను ఆవూరికి ఎన్నో వందలమైళ్ళ దూరంలో వుంటుంది.

యీరాత్రి రామారావు తనని బంధిస్తాడు. అతని కౌగిలిలోతను యిరికి పోవాలి. అతని పెదవుల్ని తను ముద్దుగొనాలి.

ఛీ-అట్లైన్నటికీ తనుచెయ్యలేదు. అందుకు తన మనస్సు వొప్పదు. హృదయంలో నారాయణరావుకి తప్పితే మరొకరికి స్థానంలేదు. ఏనాడో అంకితమయిపోయింది అతనికి తన హృదయం. అయితే యెలా తప్పించుకోవడం?

అన్నితలుపులూ బంధించబడి వున్నాయ్. తన శరీరంమీద రామారావు చేతులుపడడం తన కిష్టంలేదు.

ఆలోచిస్తూ తలుపుదగ్గరనే వుండిపోయింది. గంటకాలం గడచిపోయింది. అప్పుడే పది గంటలుదాటి పదకొండు కావస్తూంది.

రామారావు కుర్చీలోంచిలేచి లక్ష్మికి చేరువగా వెళ్ళాడు.

"ఎందుకు సిగ్గు—లక్ష్మి—రా—" భుజంమీద చెయ్యి వేశాడు.

ఒళ్లు జలదరించిందిరి ఏడవబోయింది. కళ్ళంబడి నీళ్ళురాలేదు. ఏనాడో యింకిపోయాయి. పొడారిపోయాయి కళ్ళు.

"రా... కుర్చీలో కూచో—"

తన కుర్చీకి చేరువగా చేర్చాడు అతని కుర్చీని. భుజంమీద చెయ్యివేసి గెడ్డంక్రింద చెయ్యిపెట్టి మొహంపైకి యెత్తాడు.

తనకి భీకరంగా కనుపించింది అతని మొహం. ఎలాగన్నా తప్పించుకు పారిపోవాలన్న తన నిశ్చయానికి మార్గం కనుపించటంలేదు.

బయట గోల వినపడింది. ఆగోల తన హృదయంలో బాకుపోటులా దూసుకుపోయింది. అక్కడ కూచోలేకపోయింది. తలుపుతీసుకుని యివతలకొచ్చింది. అందరూ మేడయెక్కుతున్నారు.

"అయ్యో ప్రకాశం..."

"అయ్యో నారాయణ..."

"యిద్దరూను..."

తనకి చైతన్యంలేదు. ఆమాటల్లోని అర్థంయేమీ తనకి అవగాహన కాలేదు.

"ఎంతరక్తం!"

మళ్ళీ వినిపించింది మాట. తను నిశ్చయం చేసుకుంది. తన నారాయణరావు యిక లేడు. అక్కడినుండి చరచరా నడిచి వెళ్ళిపోయింది.

"అమ్మో" అన్న కేక వినబడితే యేదో అనుకున్నాను. తీరాచూస్తే...యిదీ"

కామేశ్వరమ్మగారు గుండె బాదుకున్నారు.

"ఎంతపనిజరిగింది!" సుబ్బారావు తన ఆవేదనని వెడలగ్రక్కేడు.

మొదట ప్రకాశంగార్ని పొడిచి తరవాత తను పొడుచుకొని వుంటాడ్రా" తన వుద్దేశాన్ని తెలియపరచింది కామేశ్వరమ్మ.

నారాయణరావు జేబులోంచి బయటకు కనుపిస్తున్న వుత్తరాన్ని తీసి చదువుతున్నాడు కోటేశ్వర్రావు.

"ఏమిట్రా చప్పుడు ఏదో నూతిలోపడ్డ శబ్దంలా వుంది" ఎవరో అన్నారు.

సుబ్బారావు పరుగెత్తాడు నూతిదగ్గరకి. తనకి ఏమీనూతిలో కనిపించలేదు. చీకటిగావుంది.

"టార్చిలైటు పట్టుకురార్రా..." పొలి కేక వేశాడు.

కోటేశ్వర్రావు నూతిలోకి టార్చిలైటు వేశాడు. శవం మునిగి తేలుతూంది.

"అయ్యో నాకూతురా..."

నేల కొరిగిపోయింది కామేశ్వరమ్మ.

"ఎంతపని చేసిందిరా..."

సుబ్బారావు తలపట్టుకుని నూతిగోడకి చేరబడిపోయాడు.

"బలవంతంగా చంపేశాం—"

సుబ్బారావు పెళ్ళాం తల బాదుకుంటూంది.

"ఇదెక్కడి జాతకాలొచ్చాయర్రా—మన కొంపలు తీసిన జాతకాలు" మీనాక్షమ్మగారు యేడుస్తూంది. రామప్పంతులు కొడుకు తలదగ్గర కూచుండిపోయారు. రక్తసిక్తమైన అతనిగుండెల్ని శరీరాన్ని, పూర్తిగా కప్పేశారు.

పక్షవాతంవల్ల నడచిరాలేకపోయాడు సన్యాశిరాజు పంతులు. అక్కడే చేరబడిపోయాడు.

—సమాప్తం.

---

రైలులో ఓ సీటుకింద చుట్టుచుట్టుకు కూర్చున్న ముసలివాడు టికెట్ కలక్టరు కళ్ళబడ్డాడు. "బీదవాణ్ణి. టికెట్‌కి డబ్బులేదు. పక్కవూళ్లో నాకూతురికి పెళ్లవుతోంది- నే వెళ్లక తప్పదు. ఎవరికీ కష్టం కలుగకుండా చల్లగా వెళ్లిపోతా. దయచేసి నన్ను వదిలేయి." అని ప్రాధేయపడ్డాడు. దయతలచి సరేనన్నాడు టికెట్ కలక్టరు. కాని సరిగ్గా పక్కసీటుక్రిందే యింకో మనిషి ముడుచుకుకూర్చుని వున్నాడు. "నువ్వెక్కడికి వెళ్లాలి?" గద్దించాడు టికెట్ కలక్టరు.

"నేనే పెళ్ళికొడుకుని." అని సమాధానం చెప్పాడు ఆ మనిషి.